కవితా కౌముది

ప్రేమకథ

రవిప్రసాద్ చెలమల్లు

ఉత్తినే ఆలోచనలు.. ఆలా ఆలా అలల్లా ఎగసి
అలసి పాలనురగై తీరాన్ని తాకినప్పుడు,
ఒక్కో జ్ఞాపకం ఒక్కో వెన్నెల చినుకై
చిరునవ్వులుగా విరబూసి
కాలం ఆగిపోతే బాగుండనిపిస్తే వింతేముంది!!!

చూపు ఒకే చోట నిలుస్తుందని
మరో చూపుతో కలిశాకే తెలిసినప్పుడు
మనసు మురిసినప్పుడు
తిమిరంతో దీపం చేసే నిశ్శబ్ద
సంభాషణల సడి తెలుస్తున్నప్పుడు
కాలం ఆగిపోతే బాగుండనిపిస్తే వింతేముంది!!!

మనసంతా చీకట్లు మునిరినా
మనసైన వారి మధురోహల వెలుగు
వెన్నంటి నడిపిస్తున్నప్పుడు,
చందమామలోనూ ప్రేమ తప్ప
కుందేలు కనిపించనప్పుడు
కాలం ఆగిపోతే బాగుండనిపిస్తే వింతేముంది!!!

ప్రేమ కోసం చేసే ప్రయాణంలో
మనోవేగాన్ని అందుకోలేక విసుగెత్తినా,
తనువంతా తేలికై
పుప్పొడి కూడా బరువుగా తోచినప్పుడు
కాలం ఆగిపోతే బాగుండనిపిస్తే వింతేముంది!!!

కలిస్తే కళ్ళలో కనిపించిన ఉదయాలు,
విడివడితే అవే కళ్ళలో అస్తమయాలు
సమయాసమయాలు లేకుండా
మనోపథంలో వెంటాడుతూ ఉన్నప్పుడు
కాలం ఆగిపోతే బాగుండనిపిస్తే వింతేముంది!!!

మధుపాలి తాగేసిన తేనియలన్నీ
విరులకు తిరిగి ఇచ్చేస్తే బావున్ను,
ప్రవరాఖ్యుడికి దొరికిన పసరేదో
మనకూ ఎవరైనా ఇస్తే బావున్ను
అనిపించే పిచ్చి కోరికలు వెంటాడుతున్నప్పుడు
కాలం ఆగిపోతే బాగుండనిపిస్తే వింతేముంది!!!

ఈడు ఏదైనా,
ఈడేరినా, ఈడేరకపోయినా
కాలగమనాన్నే అడ్డుకోవాలనుకొన్న ఆ క్షణాలు
ఎప్పటికీ అజరామరాలే ఎదలోతుల్లో...

★★★



ఒంటరి ద్వీపం కాదు నేను

డా.నూకరాజు బెందుకుర్తి

నేను...
అలలతో ముద్దాడే ఇసుకలా మారిపోతూ,
ఒక క్షణం తీరమై,
మరో క్షణం సముద్రమై.

ఈ శరీరం ఒక సరిహద్దు మాత్రమే;
నా లోపల కాలం ప్రవహించే నది
నన్ను నిరంతరం కొత్తగా తీర్చిదిద్దుతుంది.

నాలో వినిపించే స్వరం
ఒంటరి గీతం కాదు...
తల్లిపాల మృదుత్వం,
సమాజపు శబ్దాలు,
సంస్కృతి జ్ఞాపకాల మేళవింపు.

నేను ఒక ద్వీపం కాదు;
అనేక చేతుల సపర్శతో
ఆకారం పొందిన తీరం.

నా అనుభవం నా హృదయంలో మొలిచినా,
దాని అర్థం ఇతరుల చూపుల్లో వికసిస్తుంది.

పొలికల కలిన కాంతిలో కాదు,
సాన్నిధ్యపు సౌమ్య వెలుగులోనే
నా స్వరూపం స్పష్టమవుతుంది.

"నేను"ని ఒంటరిగా నిలబెడితే
అది గాలిలో తేలే ప్రతిబింబం;
"మనం"లో కలిపితే
అది అర్థం పొందిన జ్యోతి!

స్వేచ్ఛ నా శ్వాస అయితే,
బంధం నా నాడి;
ఇరువురి మధ్య నడిచే సంభాషణే
నా వ్యక్తిత్వం.

కాలం నా విలువలను మలుస్తుంది,
కాని మౌనంలో మెలకువైన అంతరాత్మ
వాటిని ప్రశ్నిస్తుంది.

అక్కడే "నేను"గా ఫుడతాను...
ఇచ్చిన పేర్లను దాటి,
అప్పగించిన రూపాలను విడిచి.

సమాజపు అద్దంలో కనిపించే ప్రతిబింబం నేనే;
ఆ అద్దాన్ని గమనించే దృష్టి కూడా నేనే.

"నేను ఎవరు?" అని అడిగిన ప్రతిసారి
అలలు వెనక్కి చేరి
సముద్రం తనను తాను గుర్తించుకున్నట్లు...

చివరికి తెలిసేది ఇదే:
నేను ఒకే స్వరం కాదు - అనేక గీతాల సమ్మేళనం;
ఒక వ్యక్తి కాదు నేను -సంబంధాల వెలుగులో
వికసించే - చైతన్య సమగ్రతని! ★★★

రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఉన్నతమ్మైనదేది యీ యుర్వియందు?
నిత్యమందరి మనసుల నెగడు ప్రేమ
స్వార్థమును త్యజింపగలుగు సత్వగుణము
ఎల్లజనులశ్రేయస్సు కాంక్షించు నడత

ఎవ్వరిచ్చిరి మనకు ప్రేమించు మనసు?
ప్రేమనెరుగక స్థితమగు విశ్వమెట్లు?
రొగరహితమౌ భువికి సార్థకత యేమి?
సృష్టి తలయించు సౌహార్దసిద్ధి వలన

అతులమీ భువిని సృజించినట్టి శక్తి
ఉర్వినంతను నడిపించుచున్న శక్తి
ఎల్ల జనులలో ప్రేమ నిండించు శక్తి
మంచిచెడుల భేదమును బోధించు శక్తి

సర్వమనురొగభరితమీ జగతి యందు
శాంతిమయముగ తోచునజాండమెల్ల
ఎంతటి యశాంతి యలజడులెన్ని యున్న
శాంతికాముకులధికమీ జగతి యందు

ఆఖిలజనులు రణోన్ముఖులైన యెడల
ధారుణి యదృశ్యమవదె యుద్ధములు పెలగి
శాంతిసమతలనొశించు జనుల వలన
జగతి పయనించుచున్నది శాంతి వైపు

COMMENTS